కథానిక

# "చివరికి మిగిలేది"

"స్వామి"

అప్పుడే తెల్లవారింది. రామంగారి ఇంట్లో అంతా ఒక్కసారి గొల్లుమన్నారు. రామాన్ని పొద్దున్నే పోలీసులు వచ్చి అరెస్టు చేసి తీసుకువెళ్ళారనే వార్త, ఆకాశవాణిలా అచిరకాలంలో వూరంతా వ్యాపించింది. రామం నిజాయితీతనం, నిష్కాపట్యం, నిర్మలస్వభావం, పరువు-ప్రతిష్ఠలు, ఎరుగనివాళ్ళెవరూ లేరు ఆ వూళ్ళో. అయితే ఆ కారణంగా పోలీసులు వచ్చి అరెస్టు చేస్తారా? అందరినీ అదే సమస్య పీడిస్తోంది.

కొంచెం ప్రొద్దెక్కింది. ప్రతిచోట జనం గుంపులుగూడి గుసగుసలాడుకుంటున్నారు.

"రామం ప్రజల సొమ్ము అపహరించాడట. అందుచేత పోలీసులు వచ్చి అరెస్టు చేశారట" అన్నాడొక పెద్దమనిషి.

"రామంలాంటి నిజాయితీ మనిషి ప్రజల సొమ్ము అపహరించడమేమిటి?" అని అడిగాడొక యువకుడు ఆశ్చర్యంతో.

"ఇందులో ఆశ్చర్యపడవలసిన సంగతేముంది? డబ్బు మహా చెడ్డది" అన్నాడొక అనుభవజ్ఞుడు.

"దీన్లో వింతేముంది? ఈ రోజుల్లో ప్రజాసేవకులమని బురఖాలు తగిలించుకుని ప్రజల సొమ్ము హరించి, కోటికి పడగలెత్తే ప్రజాద్రోహులెంతమందిని చూడటంలేదు? దొరికితే దొంగ, లేకపోతే దొర" అన్నాడొక పొట్టి నిక్కరు కుర్రవాడు.

అప్పుడే ఆలస్యంగా బడిలోకి వెడుతున్న బండ విద్యార్థి ఒకడు "నిజము దేవుడెరుగు, నీరు పల్లమెరుగు" అని వల్లించుకుంటూ పోతున్నాడు.

* * *

రామం పరువు ప్రతిష్ఠలుగల రైతుబిడ్డ. ఉన్నతమైన ఆదర్శాలను అందుకోటానికి అర్రులుచాచే ఉత్సాహవంతుడు. కార్యరంగంలో అడుగడుక్కీ అంతులేని కష్టాలు వచ్చినా కాలుసాగించే కార్యదక్షుడు. స్కూలు ఫైనలు పరీక్ష పాసయిన తరువాత తల్లిదండ్రులేమన్నా తలవొగ్గి, గ్రామంలోనే వుండి గ్రామసేవకోసం కంకణం కట్టుకున్న కర్మవీరుడు.

అతని హృదయం నిరంతరం మథనపడుతూ వుంటుంది. గ్రామస్థుల బాగుకోసం, అతని మనస్సు నిత్యమూ కొత్తకొత్త ఆశాసౌధాలను నిర్మిస్తూ వుంటుంది గ్రామోన్నతికోసం. అతని కండ్లు పల్లెటూరి అమాయక ప్రజల మూర్ఖత్వము, దుర్భర దారిద్ర్యము ఘోరగస్థితి చూచి సదా అశ్రుజలధారలను వర్షిస్తూ వుంటాయి.

రామం చదువుమాని ఇంటిదగ్గర వుంటూ, చదువున్న వాణ్ణనే స్వాతిశయం చంపుకుని, కష్టించి వ్యవసాయం చెయ్యటం ప్రారంభించాడు. తోటిరైతులతో తలలో నాలుకగా మెలుగుతూ, వారి కష్టసుఖాలలో పాల్గొనసాగాడు. క్రమంగా ప్రజల విశ్వాసానికి పాత్రుడై ఆ వూరి పంచాయతీబోర్డు మెంబరయాడు. అనతికాలంలోనే ప్రెసిడెంటు పదవికూడా అందుకున్నాడు.

ప్రెసిడెంటుగా ఎన్నికయినప్పటినుంచి అతనికి కంటినిండా కునుకులేదు కడుపునిండా తిండిలేదు. ఎప్పుడూ ఒకరోజైనా ఇంటిదగ్గర భార్యాపిల్లలతో కులాసాగా కబుర్లు చెబుతూ విశ్రాంతిగా కూర్చున్న పాపాన పోలేదు. అవును ఎలా కూర్చుంటాడు? రెక్కలాడితేగాని డొక్కాడని కుటుంబం తిండికి తడుముకోవటానికే సమయం చాలదు దానికి సాయం ఈ పదవి. అందరిలాగా గౌరవమర్యాదలకోసం, కుర్చీలమీద కూర్చోవటంకోసం పదిమందిని తనచుట్టూ తిప్పించుకోవటంకోసం, లంచాలు గుంజటంకోసం పదవైతే అతనికి అంతకష్టం అక్కరలేదు.

ఎక్కడచూచినా ప్రతి వ్యక్తిలోను వ్యక్తి

గతస్వార్థం బాగా పాతుకుపోయింది. సామూహిక శ్రేయంకోసం తలపెట్టేవాడే లేడు. ఒకవేళ ఎవరైనా తలపెట్టినా, దాంట్లో ఏదో చిదంబరరహస్యంవుంటుంది. ప్రెసిడెంటు అయిన దగ్గరనుండి రామం తోటి మెంబర్ల మనస్తత్త్వాలు గ్రహించి వాటిని సరిదిద్దటానికి, గ్రామప్రజల కష్టాలు తెలుసుకుని వాటిని నివారించటానికి తిప్పలు పడుతున్నాడు.

గ్రామంలో ప్రజలు ఇండ్లల్లో శుభ్రం చేసుకుంటారు నడివీధుల్లో పెంటకుప్పలు పోస్తారు. ఎంత శ్రీమంతులైనా ఇండ్లల్లో మరుగుదొడ్లు కట్టించుకోకుండా పిల్లల్ని వీధిలో కూర్చోబెడతారు, దేహబాధా నివారణార్థం. చీకటి చాటునైతే పెద్దలుకూడా అదేపని. పబ్లికు రోడ్లమీదకు ఆక్రమణచేసి అరుగులు కడతారు. మురగనీటి ప్రవాహాల సుగంధంతో, దోమల ఝుంకారపు సంగీతాలతో, పొరుగువాడు ఏమైపోతే నాకేమనే మెట్ట వేదాంతాలతో సోమరులై కాలం గడుపుతూ వుంటారు.

పాపం రామం ఈ దుస్థితి పోగొడదామనే ప్రయత్నంతో స్వయంగా వాటిని పరిశుభ్రం చేస్తూ, ఆ పెద్దమనుష్యులదగ్గరకు వెళ్ళి నచ్చజెప్పబోతే "గ్రుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు, నువ్వు మాకు చెప్పవచ్చావా? చాల్లే వెళ్ళవోయ్! మా తాతముత్తాతలనాటినుంచీ మేము ఇలాగేవుంటున్నాము" అని అంటారు. పోనీ అధికారరీత్యా తాను వాళ్ళందరిమీదా కేసులు పెట్టి పని జరుపుదామంటే, అతడు ఆర్థిక స్తోమత కలవాడు కాడు. తెల్లవారిలేస్తే, ఆ పెద్దలను మంచిమాట చేసుకుంటేగాని తనరోజు వెళ్ళదు. నీటిలో వుంటూ మొసలితో విరోధమైతే బ్రతకటమెలాగ? పోనీ మంచిమాటలతో చెపితే వినేవారెవరు? వీళ్ళందరి మనస్సులను పరివర్తితం చేసే ఇంద్రజాలమేముంది? ఇదే అతనికి అహర్నిశాలూ అంతులేని ఆలోచన.

* * *

తెల్లవారితే ఆ వూరి లంకపాటలు. వాటిని గురించి మాట్లాడటానికి, రామం ఆ సాయంకాలము నాయుడిగారింటికి వెడదామని వీధిగుమ్మం దిగబోతున్నాడు. ఇంతలోకే లోపలనుండి పిలుపు—"ఏమండోయ్, మిమ్మల్నే! అక్కడున్నారా?"

"ఏం?" అన్నాడు రామం వెనక్కితిరిగి.

"ఒక్కసారి లోపలికి రండి, ఇప్పుడే వెడుదురుగాని" అని లోపల్నుంచి జవాబు.

"అలా నాయుడిగారింటికి వెడదామని బయలుదేరాను. అయిదు నిమిషాలలో వెళ్ళి వస్తాను" అన్నాడు రామం.

"ఆ! మీసంగతి నాకు తెలియదూ? అయిదు నిమిషాలని వెడితే అయిదుగంటలు చేస్తారు. ఒక్కమాట వినివెళ్ళండి" అని ఆదేశం.

"ఆదిలోనే హంసపాదా?" అనుకుంటూ రామం లోపలికి వెళ్ళాడు.

"ఇలా చూడండి! రేపు మన చిట్టి పుట్టిన రోజు. కొత్త నలుగుర్ని పిలిచి వాయనాలివ్వకపోతే ఎలాగ? చిట్టికి ఒక కొత్తగౌను కుట్టించొద్దూ? బజారులో ఒక మంచి గౌనుగుడ్డకొని దానికి గౌను కుట్టించుకురండి. వచ్చేటప్పుడు ఒక కుంచెడు సెనగలుకూడా తెండి. రాత్రి నానపోసుకోవాలి" అంది ఆవిడ.

"నాకిప్పుడు తీరుబడిలేదు తెల్లవారితే లంక పాటలు. తరువాత చూచుకోవచ్చులే ఈ వేడుకలన్నీ" అన్నాడు రామం కొంచెం చిరాకుగా.

"మీకొకప్పుడుతీరుబడివుంటుందా? ఎప్పుడు చూచినా మీ కా పంచాయతీబోర్డుపనే! ఎందుకొచ్చిందీ జీతంభత్యంలేని వెట్టిచాకిరీ! లేకలేక ఒక్క నలుసుపుట్టింది. దానికైనా అచ్చట్లు ముచ్చట్లు తీరకపోతే ఎలాగ? ఇంట్లోవాళ్ళు ఎలా చచ్చినా మీకు చీమ కుట్టినట్లయినా వుండదు" అని ప్రారంభించిందావిడ ఆగ్రహంగా.

ఇంతలోనే రామం తండ్రి పొలంనుంచి ఇంటికివచ్చాడు. "ఒరేయ్! రామా! రేపు పొలంలో పెంటతోలించాలి. బండుకొట్లాడి నువ్వు దగ్గరవుండి పనిచేయించాలి. నాకు వాట్లో కులాసాగా లేదు" అన్నాడు.

రామం నెత్తిమీద నాటుబాంబు పడ్డట్టయింది. రేపు తానులేకపోతే లంకపాట లాభకరంగా ఎలా జరుగుతుంది? "విఘ్నేశ్వరుడి పెళ్ళికి వేయి విఘ్నాలట."

రామం భయపడుతూ నెమ్మదిగా అన్నాడు: "నాన్నా! రేపు పంచాయతీబోర్డు లంకపాటలు. రేపటి మట్టుకి నువ్వు కొత్త శ్రమ

పడు. నేను యెల్లుండినుంచి దగ్గరుండి పని చేయిస్తాను. ఒక్క రోజుకి నన్ను వదిలిపెట్టు. నేను లేకపోతే అక్కడ పని సరిగా జరగదు."

ఈ మాటలు వినేసరికి రామం తండ్రికి అరికాలి మంట నెత్తికెక్కింది. ప్రళయకాల రుద్రుడులాగ ఉగ్రుడయ్యాడు

"అవును. నేను ఎలాచస్తే ఎవరికి కావాలి? అస్తమానమూ నీకొ పంచాయితీ గొడవే! వెధవ వెట్టి చాకిరీ! ఇంట్లో పని చెయ్యకపోతే నీకు వేళకు తిండి పెట్టే సాధుడెవడు? ఇలాగయితే నీ భార్యా పిల్లల్ని వేరే పెట్టుకుని కాపురం చేసుకో. నీకోసం గానుగ ఎద్దులాగ రాత్రింబగళ్లు నేను కష్టపడలేను!" అని గర్జించి లోపలికి పోయాడు.

పాపం! రామం ఏమి చేస్తాడు? ఆదర్శ మార్గంలో ముందుకు పోదామంటే అడుగడుక్కీ అటంకాలే కదా? పిల్లిపిల్లలాగ మెల్లగా అక్కడినుంచి వీధిలోకి జారాడు. ఘోర చింతా సముద్రంలో ఈదుకుంటూ నాయుడిగారి ఇంటివద్దకు చేరుకున్నాడు.

* * *

నాయుడుగారు ఆ వూరిలో మోతుబరి రైతు. పదిమంది రైతులు అతని చెప్పుచేతల్లో వుంటారు. అతడు గోముఖవ్యాఘ్రము. తియ్య తియ్యని కబుర్లు చెప్పి తడిగడ్డతో గొంతుక కొయ్యటంలో అతనిది అందెవేసిన చెయ్యి. అందుచేతనే అతని దుర్జనత్వం అప్రకటితముగా ఉంటుంది. ఎలాగైనా రామంనుంచి ప్రెసిడెంటు పదవి తానే పొందాలని అతడు ప్రయత్నంచేస్తున్నట్లు అతని సన్నిహితులకు తెలుసు. స్వార్థసిద్ధి కొరకు ఎటువంటి పనైనా చెయ్యటానికి అతడు జంకడు.

అప్పుడే నాయుడుగారు పొలంనుంచి ఇంటికి వచ్చి వేడినీళ్లతో స్నానంచేసి బట్టలు కట్టుకుంటున్నాడు. "నాయుడుగారూ!" అని బయటినుంచి పిలుపు వినిపించింది

"వస్తున్నానుండండి. అలా అరుగుమీద కూర్చోండి." అని జవాబు చెప్పి బట్టలు కట్టుకుని బయటకు వచ్చాడు.

రామం లేచి, "నమస్కారమండి నాయుడు గారూ!" అన్నాడు.

"ఓహో! రామమూ? ఇలా వచ్చావేం ఏమిటి విశేషాలు?" అని ప్రశ్నించాడు నాయుడుగారు.

"అబ్బే ఏమీ లేదండీ! రేపు లంకపాటలు కదూ?" అన్నాడు రామం.

"ఓహో! అలాగా!" అన్నాడు నాయుడు గారు తెలియనివాడిలా ఆశ్చర్యాన్ని నటిస్తూ.

"ఇంత వరకూ మీకు తెలియదా?" అన్నాడు రామం.

"ఆఁ తెలుసును లే! కాని మరచిపోయాను" అన్నాడు నాయుడుగారు.

"ఈపాటమీదే మన రోడ్డు ఆధారపడి వుంది" అన్నాడు రామం.

"అదేమిటి? అలా అంటున్నావేం?" అని నాయుడిగారి ప్రశ్న.

"ఏముందండి. క్రిందటి సంవత్సరము వచ్చిన ఆదాయంతో కంకర తెప్పించాను. రోడ్డు వేయించటానికి నాదగ్గిర ఎర్రని ఏగానీ లేదు. ఈ పాటల్లో ఏమైనా డబ్బువస్తే దానితోనే రోడ్డు వేయించాలి. అందుకనే మీదగ్గరకు వచ్చాను" అన్నాడు రామం.

"నావల్ల ప్రయోజనం ఏముంటుంది?" అన్నాడు నాయుడుగారు పెదవి విరుస్తూ.

"అదేమిటి అలాగంటారు? మీరు కాస్త ప్రోత్సాహపరచి పాట పెంచితే కావలసినంత డబ్బు వస్తుంది. ఇప్పుడు రాకపోతే ఈ ఏడాదంతా ఇబ్బందే" అన్నాడు రామం.

"అవును గాని రామం, నీకొక సంగతి చెప్తా విను. నీకెందుకు ఈ ప్రెసిడెంటు పని, ఈ అవస్థలున్నూ? నువ్వు చిన్నవాడవు—అనుభవం లేదు—అన్నిటికీ అనవసరంగా ఖర్చు పెడుతూ వుంటావు" అన్నాడు నాయుడు గారు.

"నేనెప్పుడూ అనవసరం ఖర్చు వేయలేదే?" అన్నాడు రామం.

"అనవసరం ఖర్చు కాకపోతే మరేమిటి? ఆ హైస్కూలికి పంచాయతీనుంచి రెండు వేలు రూపాయలు ఇప్పించావు? దాంట్లో మన పిల్లలేమన్నా వెళ్ళి చదువుకుంటారా? ఆ బ్రాహ్మణుల పిల్లలు వెళ్ళి చదువుకోవటమేగా? ఆ దేవాలయానికి మరమ్మతు చేయించటానికి వంద రూపాయ లెందుకియ్యాలి? ఇవన్నీ అనవసరం

ఖర్చులు కాదూ?" అన్నాడు నాయుడుగారు విసురుగా.

"మీరు అలాగంటే ఎలాగ? హైస్కూల్లో ఒక్క బ్రాహ్మణుల పిల్లలే చదువుకోవడమేమిటి? మన పిల్లల్ని హైస్కూలికి పంపవద్దన్నారా ఎవరైనా? ప్రతివారికీ విద్య అవసరమే! మన గ్రామక్షేమంకోసం అవసరమైన హైస్కూలికి రెండు వేలిస్తే అది అనవసరమెలా అవుతుంది? మన గ్రామస్థు లందరికీ సంబంధించిన దేవాలయం కూలిపోతూంటే ఒక వంద రూపాయలిచ్చి మరమ్మతు చేయిస్తే అది అనవసరపు ఖర్చా? అయితే ఇంక అవసరపు ఖర్చు ఏమిటో కాస్త సెలవిస్తారా?" అన్నాడు రామం కొంచెం ఆవేశంతో.

"ఈ కాలం కుర్రవాళ్లకు జవాబు చెప్పటం కూడా కష్టమే. నేనే ప్రెసిడెంటుగా వుంటే ఇటువంటి అనవసరపు ఖర్చులకు సొమ్ము పాడు చేసి వుండేవాణ్ణి కాదు" అన్నాడు నాయుడు గారు.

"పోనీలెండి, ఈ రోడ్డుపనిలోనైనా కాస్త సహాయం చెయ్యండి" అన్నాడు రామం బ్రతిమాలుతూ.

"నాకు చేతనయినంతవరకూ తప్పక సహాయం చేస్తాను. ఇంక వెళ్ళిరా. భోజనానికి వేళవుతోంది" అంటూ లేచి నిలబడ్డాడు నాయుడుగారు.

* * *

లంకపాటలు అయిపోయాయి. మూడు వేలవరకూ వస్తుందనుకున్న సొమ్ము మూడువందలు మాత్రమే వచ్చింది. సర్కారుకి కట్టవలసిన పన్నుకిమాత్రం ఆ సొమ్ము సరిపోతుంది. ఇంక రోడ్డకి సొమ్మేదీ? మళ్ళీసంవత్సరంవరకు రోడ్డుపని వాయిదా! ప్రెసిడెంటుపడే అవస్థలు ప్రజలకేమి తెలుస్తాయి? ఊళ్ళో రోడ్లు లేవని ఉన్న వాళ్ళందరూ రామాన్ని నిందించడమే.

రామానికి వాగ్దానమిచ్చినట్లుగా పాట పెంచి సహాయం చెయ్యడానికి బదులు నాయుడుగారు రైతులందరినీ గుప్పెట్లో పెట్టుకుని లాలూచీపడి మూడువందలతో పాట ముగించారని వదంతి వ్యాపించింది.

కాలచక్రం తిరిగిపోతోంది. వేసిన కంకర గుట్టలు వేసినట్లుగానేవుంటూ క్రమంగా చిన్నవౌతున్నాయి. ఎవరూ చూడకుండా ఇంటి అరుగులు కట్టించుకునేవాళ్ళుకొందరు, ఇంట్లో చప్టాలు చేయించుకునేవాళ్లు కొందరు. "ఇదేం పరాయిసొమ్ము కాదుగా, మన ప్రజల సొమ్మే కదా. ఇందులో తప్పేముంది?" అని వారి భావన.

ఒక రోజున అకస్మాత్తుగా అధికారులు వచ్చారు తణిఖీ చెయ్యడానికి. రెండువేలరూపాయల కంకర తెచ్చినట్లు కాగితంలో వుంటే ఊళ్ళో కంకర గుట్టలను కొలవగా తేలినది వెయ్యిరూపాయలకిమ్మత్తు గలిగినకంకరే! ఇంతకంటె, రామం ప్రజలసొమ్ము హరించాడనటానికి ప్రబల ప్రమాణమింకేం కావాలి? మరాడు ప్రొద్దున్నే పోలీసువాళ్లువచ్చి అతన్ని అరెస్టుచేసి తీసుకువెళ్ళారు. అతనికి సాయం చేసేవాళ్ళెవరూ లేరు.

శాంతి, యుద్ధకాలం దేనిపాలు ఎంతయితేనేం గాక—నేను సింహాసనం అధిష్ఠించి యాభై సంవత్సరాలు దాటింది. ప్రజలకు ప్రీతిపాత్రుడుగా, శత్రువులకు సింహస్వప్నంగా మిత్రుల గౌరవాన్ని చూరగొంటూవచ్చాను. సంపదలు, గౌరవం, అధికారం, సుఖానుభూతులు, అన్నీ నాకు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రపంచంలో నాకు అందుబాటులో లేని భౌతికానందం అంటూ లేదు. అయినా, నిజమైన, నిష్కల్మషమైన ఆనందం అనుభవించినరోజులు ఎన్ని అని లెక్కవేస్తే నా జీవితంలో అవి పధ్నాలుగుకంటె ఎక్కువ లేవు.

—కాలిఫ్ అబ్దుల్ రహమ్